క్లుప్తంగా

రేపు ప్రవేశ పరీక్ష

రామాపురం : మండల పరిధిలోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో 5వ తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరం ప్రవేశాల కోసం 23న ఆదివారం ఉదయం 10 గంటల నుంచి 12గంటల వరకు 5వ తరగతి విద్యార్థులకు, మధ్యాహ్నం 2గంటల నుంచి 4.30 నిమిషాల వరకు ఇంటర్మీడియట్ విద్యార్థులకు ప్రవేశ పరీక్షను నిర్వహిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ బి.చిట్టిబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. దరఖాస్తు చేసుకొన్న విద్యార్థులు ప్రవేశపరీక్షకు హాజరు కావాలన్నారు.

వీరభద్రస్వామి సన్నిధిలో ఉన్నతాధికారులు



డీఆర్‌ఓను సత్కరిస్తున్న ఆలయ కమిటీ

రాయచోటి టౌన్ : వీరభద్రస్వామిని జిల్లా కలెక్టరేట్ అధికారులు జాయింట్ కలెక్టర్, డీఆర్‌ఓ సత్యనారాయణ దర్శించుకున్నారు. శుక్రవారం ఆలయానికి రాగానే ఆయనకు ఆలయ సాంప్రదాయం ప్రకారం ఆలయ కమిటీ, ఈఓ ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. అనంతరం వారు స్వామివారికి, అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయించారు. అలాగే తీర్థ ప్రసాదాలు అందజేసి దుశ్శాలువా, పూల హారాలతో ఘనంగా సన్మానించారు.

రేపు మోటకట్లలో ఉచిత కంటి వైద్య శిబిరం

సంబేపల్లె : మండల పరిధిలోని మోటకట్ల శ్రీ వెంకటశివసాయి దేవాలయ ట్రస్ట్ ఆధ్వర్యంలో శ్రీ వెంకటేశ్వర అరవింద కంటి ఆసుపత్రి తిరుపతి, ప్రభుత్వ జిల్లా అంధత్వ నివారణ సంస్థ సంయుక్తంగా ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు పి.వి సుబ్బారెడ్డి కుటుంబ సభ్యులు తెలిపారు. మండలంలోని మోటకట్ల జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో దృష్టి సమస్యలు ఉన్నవారికి ఉచితంగా వైద్య సేవలు అందిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నల్ల గంగమ్మ తిరునాలను జయప్రదం చేయండి



కరపత్రాలను అందజేస్తున్న సర్పంచ్ ముసల్‌రెడ్డి

చిన్నమండెం : మే నెల 5వ తేదీన సంబేపల్లెలో వెలిసిన దేవరరాయి నల్లగంగమ్మ తిరునాల మహోత్సవాన్ని జయప్రదం చేయాలని వండాడి సర్పంచ్ ముసల్‌రెడ్డి కోరారు. ఈ మేరకు వండాడి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.


'అనుమతి లేకుండా పొలంలో దారి వేశారు'

వీరబల్లి (రాయచోటి టౌన్) : దౌర్జన్యంగా తమ అనుమతులు లేకుండా మా పొలంలో నుంచి పోలీసులతో కలసి రెవెన్యూ అధికారులు దారి ఏర్పాటు చేశారని ఓదివీడు గ్రామం రామాపురానికి చెందిన సుమతమ్మ ఫిర్యాదు చేశారు. శుక్రవారం గ్రామానికి వచ్చిన పోలీసులు, రెవెన్యూ ఇన్స్పెక్టర్ మా పొలంలో నుంచి దారి ఇవ్వాల్సిందేనంటూ కనీసం పెద్ద మనుషులతో మాట్లాడకుండానే జేసీబీ సాయంతో దారి ఏర్పాటు చేశారు. దీని వలన తాను చాలా నష్టపోతున్నానంటూ వీరబల్లె మండల తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఉన్నత స్థాయి అధికారులు వచ్చి సమస్యను పరిష్కరించాలని ఆమె కోరారు.

చలివేంద్రం ఏర్పాటు

రామాపురం : మండల పరిధి నల్లగుట్టపల్లి గ్రామం సమీపంలోని గంగేను క్రాస్ వద్ద శుక్రవారం నల్లగొండపల్లి గ్రామానికి చెందిన తిరుపతి రామయ్య జ్ఞాపకార్థం చలివేంద్రాన్ని ఆయన కుమారుడు రఘునాథ్ ఏర్పాటు చేశారు. వేసవికాలంలో బాటసారుల దప్పిక తీర్చడం పుణ్యకార్యమని తన తండ్రి జ్ఞాపకార్థం చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. అదేవిధంగా బీసీ కాలనీలో నీటి ఎద్దడి ఉండటంతో తన సొంత ఖర్చుతో ప్రతి రోజు నీళ్ల ట్యాంకర్లతో ప్రజలకు నీటి కష్టాలను తీరుస్తున్నారు.

ఏఐటీఎస్‌లో అగ్నిమాపక సిబ్బంది మాక్‌డ్రిల్



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

రాజంపేట : అగ్నిమాపక సిబ్బంది ఏఐటీఎస్‌లో శుక్రవారం మాక్‌డ్రిల్ నిర్వహించారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి కళాశాలలో ఫైర్ సిస్టమ్ మానిటరింగ్ టీమ్‌చే మాక్‌డ్రిల్ నిర్వహిస్తారు. ఈ సందర్భంగా అగ్నిమాపక అధికారి శివశంకర్‌రెడ్డి మాట్లాడుతూ ఏదైనా అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు వాటిని ఎలా ఎదుర్కోవాలో విద్యార్థులకు తెలియజేశారు. తమకు తాము ఎలా రక్షించుకోవాలి అనే విషయాలపై పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ప్రిన్సిపాల్ ఎస్ఎంవీ నారాయణ, అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

ఆవుల వేల్పు ఉత్సవానికి ఏర్పాట్లు

- ప్రత్యేక ఆకర్షణగా దేవరెద్దుల నాణేలు
- 8 సంవత్సరాల తర్వాత జరుగనున్న ఉత్సవం



చలువపందిళ్లను సిద్ధం చేస్తున్న గ్రామస్తులు

సంబేపల్లె : సాంప్రదాయ ఉత్సవంలో భాగంగా తమ వంశ ఆచారమైన ఆవుల వేల్పు ఉత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు దొడ్డివారి వంశీయులు, దొడ్డి సిద్దయ్యగారిపల్లె గ్రామస్తులు తెలిపారు. ఉత్సవాలలో మల్లికార్జున స్వామికి వైభవంగా పూజలు చేయనున్నారు. దొడ్డిసిద్దయ్యగారిపల్లె గ్రామస్తులు తెలిపారు. ఈ ఆవుల వేల్పు 8 సంవత్సరాలు తర్వాత వైభవంగా నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. వేల్పు నిర్వహించే ప్రాంతాన్ని సాంప్రదాయ రీతిలో బందారాకు తదితర శ్రేష్ఠమైన చెట్టు కొమ్మలతో చలువ పందిళ్లు వేసి మల్లికార్జునస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. వేల్పును పురస్కరించుకొని ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. మూడు రోజుల పాటు నిర్వహించే ఉత్సవాలలో 22వ తేదీ రాత్రి ఆవులు గంగదొడ్డికి పోవుట, 23 న రాత్రి 11:00 శ్రీ మల్లికార్జునుడు, శ్రీ వీరభద్రుడు, కదిరి లక్ష్మీనరసింహ స్వామి వార్లను ఆహ్వానిస్తారు.

సైన్స్‌కు అందని సత్యం..

సైన్స్ అభివృద్ధి చెందినా నేటి ఆధునిక కాలంలో సైన్స్‌కు అందని ఎన్నో సత్యాలలో రాగిరొట్టెకు విసురురాయి కట్టుట లనే క్రతువు నేటికి జనులు ఆశ్చర్య చకితులను చేస్తోంది. తేలికైన రాగిరొట్టె, సన్నని దారంతో విసురురాయిని అనుసంధానం చేస్తూ వేల్పు జరిగే ప్రాంతంలోని చెట్టు కొమ్మకు వేలాడతీయడం భక్తికి నిదర్శనంగా భావిస్తారు. అనంతరం 24వ తేదీ నాణేలు తెచ్చి దేవరెద్దుచే భక్తులను నిర్ణయించుట తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులు వేలసంఖ్యలో వచ్చే అవకాశం ఉండటంతో పెద్దఎత్తున ఏర్పాట్లు చేస్తున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.



మల్లికార్జున స్వామి మూలవిరాట్

పరిశ్రమ ఏర్పాటుకు కృషి చేయండి

నిరుపయోగంగా ఉన్న ఆల్విన్ ఫ్యాక్టరీ భూ విషయమై సబ్ కలెక్టర్‌ను కలిసిన ఎంపీపీ మేడా



సబ్‌కలెక్టర్‌ను సన్మానిస్తున్న ఎంపీపీ విజయభాస్కర్‌రెడ్డి

రాజంపేట : ఆల్విన్ ఫ్యాక్టరీలో ప్రత్యామ్నాయ పరిశ్రమ ఏర్పాటు చేసేలా కృషిచేయాలని సబ్‌కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌ను కోరామని ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం రాజంపేట సబ్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌ను ఆయన చాంబరులో కలిసి ఘనంగా సన్మానించారు. రంజాన్ పండుగను పురస్కరించుకొని ముందస్తుగా శుభాకాంక్షలను తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఉన్న సహజవనరులను వినియోగంలోకి తెచ్చేందుకు సబ్‌కలెక్టర్ కృషి చేయాలన్నారు. ఆల్విన్ ఫ్యాక్టరీ స్థలంలో ప్రత్యామ్నాయ పరిశ్రమ ఏర్పాటు చేయాలనే కృషి చేయాలని కోరారు. ఆ దిశగా ప్రభుత్వానికి ప్రతిపాదనలను పంపాలన్నారు. 30 పడకల ఆసుపత్రి, జూనియర్ కళాశాల నిర్మితంకు సంబంధించి స్థలానికి మంజూరునకు అనుమతులు ఇవ్వాలని కోరామన్నారు. స్పందించిన సబ్‌కలెక్టర్ ఆల్విన్ భూములు, ప్రభుత్వ భూముల వివరాలు సేకరించాలని సబ్‌కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ ఆదేశించారు. నందలూరు తహసీల్దారు ఉదయ శంకర్‌రాజు ఫోన్ చేసి ఎక్కడెక్కడ ఉన్న ప్రభుత్వ భూములకు సంబంధించి పూర్తి సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వక్ఫ్ బోర్డు సెక్రటరీ అమీర్, మండల కో-ఆప్షన్‌సభ్యుడు కలీం, వైఎస్సార్‌సీపీ నాయకుడు యల్లంరాచపల్లె సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

మూల్యాంకన భత్యం పెంపు హర్షణీయం

కడప ఎడ్యుకేషన్: పదవ తరగతి పరీక్షల నిర్వహణ, జవాబు పత్రాల మూల్యాంకన విధుల్లో పాల్గొన్న ఉపాధ్యాయులకు, సిబ్బందికి ప్రభుత్వం రెమ్యూనరేషన్‌ను పెంచడం అభినందనీయం అని ఎస్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు రామాంజనేయులు అన్నారు. ఇందుకు వారు శుక్రవారం కడపలోని మూల్యాంకన కేంద్రంలో ఉపాధ్యాయులతో కలిసి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగ ఉపాధ్యాయులకు రావాల్సిన డీఏలను కూడా ప్రభుత్వం ప్రకటించాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సహాధ్యక్షుడు మురళీ, రాష్ట్ర నాయకులు వెంకటసుబ్బయ్య, రామచంద్ర, రామలక్ష్మి, జిల్లా నాయకులు గురివిరెడ్డి, మదన్‌మోహన్‌రెడ్డి, రవిశంకర్, వెంకటసుబ్బయ్య, ప్రసాద్ పాల్గొన్నారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు



పూజల్లో పాల్గొన్న భక్తులు

పుల్లంపేట : అనంతంపల్లి వద్ద నూతనంగా నిర్మించిన మేడాలమ్మ తల్లి ఆలయంలో శుక్రవారం పూజారి శివశర్మ ఆధ్వర్యంలో అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం మేడాలమ్మ ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని దర్శించుకునేందుకు మహిళలు పెద్ద సంఖ్యలో వచ్చారు. అనంతరం భక్తులకు అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు.

జ్వరాలు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి



సిబ్బందికి సూచనలు చేస్తున్న వైద్యాధికారి

లక్కిరెడ్డిపల్లె : మలేరియా, డెంగీ వ్యాధులు ప్రబలకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్ రఫీవుల్లాఖాన్, మలేరియా సబ్ యూనిట్ అధికారి వై.ప్రసాద్ యాదవ్‌లు తెలియజేశారు. శుక్రవారం డ్రైడే, ఫ్రైడే సందర్భంగా లక్కిరెడ్డిపల్లెలోని మిస్బా చర్చి ప్రాంతాలలో పర్యటించి తొట్లల్లో, డ్రమ్ముల్లో నిల్వ ఉన్న నీటిలో అబేట్ వేసి దోమలార్వా ఉన్న నీటిని తొలగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని, నీరు నిల్వ ఉన్న డ్రమ్ములు, తొట్లు వారంలో ఒకసారి నీటిని తీసివేసి ఒకగంట ఆరబెట్టాలన్నారు. దోమల వలన డెంగీ, మలేరియా, చికెన్ గున్యా వంటి జ్వరాలు ప్రబలుతున్నాయని, జాగ్రత్తలు పాటించాలన్నారు. ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు ప్రతిరోజూ గ్రామాలలో పర్యటించి జ్వర పీడితలను గుర్తించి వారికి సరైన మందులు అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో విస్తరణ అధికారి ఎస్.దేవదానం, సూపర్‌వైజర్ ఎం.సురేంద్రరెడ్డి, ఏఎస్ఎం జహీర్ బేగ్, ఆశాలు పాల్గొన్నారు.

పాఠశాలలో ఇఫ్తార్ విందు



ఇఫ్తార్ విందులో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

ఓబులవారిపల్లె : మండల కేంద్రంలోని శ్రీ రిషీ అప్పర్ ప్రైమరీ పాఠశాలలో కరస్పాండెంట్ టి.యువరాజ విద్యార్థులకు శుక్రవారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు రంజాన్ మాసం ప్రాముఖ్యత, ఉపవాస దీక్షలు, రంజాన్ పండుగ విశిష్టత గురించి వివరించారు కార్యక్రమంలో హెడ్ టీచర్ దామోదర వల్లి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మత సామరస్యానికి ప్రతీక రంజాన్

ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యేలు శ్రీకాంత్‌రెడ్డి, మల్లికార్జునరెడ్డి

రాయచోటి : రంజాన్ పండుగ క్రమశిక్షణ, దాతృత్వం, ధార్మిక చింతనల కలయిక అని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి అన్నారు. మత సామరస్యానికి, పరస్పర సదవగాహనకు ప్రతీకంగా రంజాన్ నిలుస్తుందని శుక్రవారం పత్రికలకు అందజేసిన ప్రకటనలో ఎమ్మెల్యే పేర్కొన్నారు. రంజాన్ మాసంలో వికసించిన ఆధ్యాత్మికత, ప్రేమ, దయ, సామరస్యపు కుసుమలు ప్రజలు జీవితాలలో గుభాళించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ప్రజలకు శ్రీకాంత్ రెడ్డి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే మేడా

రాజంపేట : నియోజకవర్గ ప్రజలకు రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి రంజాన్ శుభాకాంక్షలను తెలిపారు. శనివారం జరగనున్న రంజాన్ పండుగను ముస్లింలు అత్యంత పవిత్రంగా జరుపుకోవడం ఆనందదాయకమన్నారు. రంజాన్ పండుగను ముస్లింలు అతిపవిత్రంగా భావించి, ఉపవాసాలు చేసి తమ భక్తిని చాటుకుంటారన్నారు. ముస్లింల సంక్షేమానికి పాటుపడే ముఖ్యమంత్రి జగన్‌ను ప్రార్థనల్లో గుర్తు చేసుకోవాలని ఎమ్మెల్యే కోరారు.

రంజాన్‌ను అందరూ జరుపుకోవాలి



రంజాన్ కానుకలు అందజేస్తున్న మదన్‌మోహన్‌రెడ్డి

రాయచోటి టౌన్ : రంజాన్ పర్వదినాన్ని ధనిక, పేద అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరూ సంతోషంగా పండుగను జరుపుకోవాలని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి మదన్‌మోహన్‌రెడ్డి ఆకాంక్షించారు. శుక్రవారం రాయచోటి పట్టణంలోని అర్చన విద్యాసంస్థలలో ఆ ప్రాంతంలో నివసిస్తున్న పేద ముస్లింలకు నిత్యావసర సరుకులు, చికెన్‌ను అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్‌లు జయన్న నాయక్, భాస్కర్, వైఎస్సార్ సీపీ నాయకులు బుజ్జిబాబు, వెంకట్రామిరెడ్డి, యోగాంజిరెడ్డి, రాజేంద్ర, ఆది, నాగేశ్వర్, రామ్మోహన్, రెడ్డెయ్య, అమరనాథ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

రక్తకొరతను అధిగమిద్దాం

వైవీయూ : బ్లడ్ బ్యాంకుల్లో రక్తకొరత ఉంటోందని, దానిని అధిగమించేందుకు అర్హులు రక్తదానం చేయాలని బ్లడ్ టు లివ్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు పట్టుపోగుల పవన్‌కుమార్ కోరారు. శుక్రవారం కడప నగరం ఏడు రోడ్ల కూడలిలో బ్లడ్ టు లివ్ సంస్థ ఆధ్వర్యంలో రక్తదాన వారోత్సవాలను నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కడప రిమ్స్ బ్లడ్ బ్యాంకులో రక్తనిల్వలు తగ్గాయని.. రక్తం అందక ఏ ఒక్కరి ప్రాణం పోకూడదన్న లక్ష్యంతో రక్తదాన కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు.

భద్రకాళి మాతకు రాహుకాల పూజలు



దర్శనమిస్తున్న భద్రకాళి

రాయచోటి టౌన్ : రాయచోటి భద్రకాళి అమ్మవారికి రాహుకాల పూజలు నిర్వహించారు. శుక్రవారం ఉదయం అమ్మవారికి ఆలయ పాలక మండలి అధ్యక్షురాలు పొలంరెడ్డి విజయ, ఆలయ ఈఓ డివి రమణారెడ్డిల ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు అమ్మవారికి అభిషేకాలు, పూజలు, కుంకమార్చనలతో పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి పూలు, పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలు, నిమ్మకాయల హారాలతో అలంకరించారు. భక్తులకు అమ్మవారిని దర్శించి తీర్థప్రసాదాలు తీసుకున్నారు.

నేడు ధరిత్రీ దినోత్సవ ర్యాలీ

కడప కల్చరల్ : ప్రపంచ ధరిత్రీ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం ఉదయం 7 గంటలకు నగరంలో ధరిత్రీ దినోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్నామని పర్యావరణ మిత్ర సమూహం సొసైటీ ప్రతినిధి ప్రసాదురెడ్డి తెలిపారు. స్థానిక మున్సిపల్ మెయిన్ హైస్కూలు నుంచి ఏడురోడ్ల కూడలి మీదుగా పాత కలెక్టరేట్ వరకు ర్యాలీ కొనసాగుతుందన్నారు. ర్యాలీ అనంతరం కడప నగరాన్ని నీమ్ సిటీగా మార్చేందుకు నా చెట్టు-నా బాధ్యత పేరిట నగరంలో 100 మొక్కలు నాటేందుకు విద్యార్థులకు మొక్కలను అందిస్తామని తెలిపారు.

విధులను చిత్తశుద్ధితో నిర్వర్తించాలి



డ్రైవర్లకు సూచనలు చేస్తున్న ట్రైనర్

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీఎస్ ఆర్టీసీలో పనిచేస్తున్న డ్రైవర్లు చిత్తశుద్ధితో పనిచేసి సంస్థ పురోభివృద్ధికి కృషి చేయాలని డీపీటీఓ గోపాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం కడప నగరంలోని ఆర్ఎం కార్యాలయ కాన్ఫరెన్స్ హాలులో కేఎంపీఎల్ పెరుగుదల లేని డ్రైవర్లకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ డ్రైవర్లు మద్యం సేవించి విధులకు రావడం, అకారణంగా విధులకు గైర్హాజరు కావడం, ప్రయాణీకుల పట్ల దురుసుగా ప్రవర్తించడం, ర్యాష్ డ్రైవింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్ ను మానుకోవాలన్నారు. ఈ కార్యక్రమానికి కడప డిపో నుంచి 8 మంది, పులివెందుల 5, బద్వేలు 3, జమ్మలమడుగు 3, మైదుకూరు 1, ప్రొద్దుటూరు డిపో నుంచి ఐదుగురితోపాటు హైర్ బస్సుల ఇరువురు డ్రైవర్లు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మైదుకూరు డిపో మేనేజర్ రామకృష్ణ, ట్రైనర్, యూనియన్ నాయకులు, ఉద్యోగులు, డ్రైవర్లు పాల్గొన్నారు.

మోడల్ ఎంసెట్‌ను జయప్రదం చేయాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: ఈ నెల 24 నుంచి 30 వరకు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న మోడల్ ఎంసెట్‌ను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సగిలి రాజేంద్ర ప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇంజనీరింగ్ చేరదల్చుకున్న విద్యార్థులు ఈ ఎంసెట్ మోడల్ పరీక్షను జయప్రదం చేయాలన్నారు. వివరాలకు 95022 08191 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

పొన్నవోలులో ఉచిత పశువైద్య శిబిరం



పాడిరైతులకు మందులను అందజేస్తున్న దృశ్యం

సిద్దవటం : మండలంలోని పొన్నవోలు గ్రామంలో శుక్రవారం పశు సంవర్ధక శాఖ, జిల్లా నీటి యాజమాన్య సంస్థ (వాటర్‌షెడ్) వారి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. శిబిరంలో సిద్దవటం పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ ఎం.వి. సబ్బరాయుడు పాల్గొని మాట్లాడారు. దూడలకు నట్టల నివారణ మందును తాపించామన్నారు. వేసవి కాలంలో పశువులలో తీసుకోవాల్సిన జాగ్రతల గురించి పాడి రైతులకు వివరించామన్నారు. శిబిరంలో 18 ఆవులు, గేదెలకు గర్భ నిర్ధారణ పరీక్షలు, గర్భకోశ వ్యాధికి చికిత్సలు, 12 అనారోగ్య బారిన పడిన పశువులకు చికిత్స, 28 దూడలకు నట్టల నివారణ మందులు, 134 మేకలకు, గొర్రెలకు నట్టల నివారణ మందులు, కోళ్లకు కొక్కెర తెగులు రాకుండా చికిత్సలు చేసి ఉచితంగా మందులను అందజేశామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మాచుపల్లె పశువైద్యాధికారి డాక్టర్ స్వేత, వాటర్ షెడ్ సిబ్బంది రామచంద్ర, పశుసంవర్ధక శాఖ సిబ్బంది యాకోబ్‌సాహేబ్, జిలానీ బాష, ఉమామహేశ్వర్‌రావు, ఓబులేస్ , నరసింహులు, పాడి రైతులు పాల్గొన్నారు.

పథకాల అమలు తీరుపై సమావేశం



మాట్లాడుతున్న అధికారి నాగరాజు

సిద్దవటం : వ్యవసాయ పథకాల అమలుపై సమావేశాన్ని మండల కేంద్రంలోని వ్యవసాయాధికారి కార్యాలయంలో శుక్రవారం నిర్వహించినట్టు వ్యవసాయాధికారి రమేష్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన బద్వేల్ సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం.నాగరాజు మాట్లాడుతూ రైతు భరోసా పథకానికి సంబంధించి ఆర్బీకేల పరిధిలో కొత్తగా పట్టాదారు పాస్ పుస్తకాలు వచ్చిన రైతులను గుర్తించి వారికి పథకం వర్తించేలా రైతు భరోసా పోర్టల్ లో అర్హత ఉన్న రైతుల వివరాలను నమోదు చేయాలని కోరారు. ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకానికి సంబంధించి ఇంకా ఈకేవైసీ చేయించుకోకుండా పెండింగ్ ఉన్న రైతులను గుర్తించి వారితో మాట్లాడి వారందరికీ పి.ఎం. కిసాన్ పథకం వర్తించేలా చేయాలన్నారు. ప్రతిరోజు వైఎస్ఆర్ యాప్, సీఎం యాప్ అప్‌డేట్ చేయాలని సూచించారు. రైతు భరోసా మాస పత్రికను చందాదారులైన రైతులకు ప్రతి నెల అందించాలన్నారు. వేసవిలో సాగు చేసిన పంటలను గుర్తించి ఆ రైతులకు పంట నమోదు చేయాలన్నారు. పొలాల్లో మట్టి నమూనాలను సేకరించి ప్రయోగశాలకు పంపించాలన్నారు. ఆర్బీకే సిబ్బంది అన్నీ పథకాలను రైతులు పొందే విధంగా పనిచేయాలన్నారు. రైతులకు సకాలంలో అన్నీ సేవలను అందించి గుర్తింపు తెచ్చుకోవాలని సిబ్బందికి తెలియజేశారు. కార్యక్రమంలో వీఏఏలు, ఉద్యాన సహాయకులు, ఎంపీఈఓలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అమ్మవారికి లక్ష కుంకుమార్చన



కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

సిద్దవటం : మండలంలోని బంగారుపేట గ్రామం వద్ద వెలసిన గంగాభవాని అమ్మవారి 31వ వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా శుక్రవారం లక్ష కుంకుమార్చన పూజలు ఘనంగా నిర్వహించినట్టు ఆలయ ట్రస్టు అధ్యక్షుడు మాడా పెద్దసుబ్బరాయుడు, రామక్రిష్ణయ్యలు తెలిపారు. మధ్యాహ్నం అమ్మవారికి లక్ష కుంకుమార్చన పూజలు చేసి పూజలో పాల్గొన్న పుణ్య స్త్రీలందరికి ప్రసాదాలు. అమ్మవారి గాజులు, పసుపు, కుంకుమలు అందజేశామని వారు చెప్పారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని కాయాకర్పూలను అందజేసి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న మాస్టర్ ట్రైనర్ వెంకటరమణ

లక్కిరెడ్డిపల్లె : ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయంపై మొగ్గు చూపితే మంచి దిగుబడితోపాటు లాభదాయకమని ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ వెంకటరమణ పేర్కొన్నారు. శుక్రవారం లక్కిరెడ్డిపల్లె, రెడ్డివారిపల్లె రైతు సంఘాలు, రైతు భరోసా కేంద్రం వ్యవసాయ సభ్యులు, స్వయం సహాయక సంఘాల మిత్రులు కలుపుకొని ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రతి ఇంటికి వెళ్లి ప్రకృతి వ్యవసాయంపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం ఖరీఫ్ యాక్షన్ ప్లాన్ గురించి రైతులతో మాట్లాడారు. ఇంటి పరిసరాలలో కిచెన్ గార్డెన్, కూరగాయలు, ఆకుకూరలు పండించుకోవచ్చన్నారు. గింజలు తినడం వల్ల మనిషి ఆరోగ్యకరంగా ఉంటారని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ యూనిట్ సభ్యులు గంగిరెడ్డి, లక్ష్మీదేవి, నాగమణి, చంద్రమోహన్ రెడ్డి, షాహీర్ బాషా, నాగార్జున ఆచారి, ఇంటర్‌నెట్ కమిటీ కమ్యూనిటీ పర్సన్స్, రైతులు పాల్గొన్నారు.

పేదలకు ఆహార పొట్లాల పంపిణీ



చిట్వేలి: ఆహారపొట్లాలు పంపిణీ చేస్తున్న ముస్లింలు

నందలూరు(రాజంపేట) : నందలూరు రైల్వేకేంద్రంలో శుక్రవారం వృద్ధులకు, నిరుపేదలకు ఆహార పొట్లాల పంపిణీ కార్యక్రమం శుక్రవారం వైఎస్సార్ సీపీ బీసీ నాయకుడు హిమగిరియాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన కుమార్తె జ్యోతిశ్రీ యాదవ్ జన్మదిన సందర్భంగా అందరి ఆకలి తీర్చడం తనకెంతో సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో యువనాయకుడు గుడిపాటి చిన్నరాయుడు, హెచ్ఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు డేవిడ్ కల్యాణరాజ్ తదితరులు పాల్గొన్నారు.

చిట్వేలిలో..

చిట్వేలి : పవిత్రమైన రంజాన్ మాసంలో పేదలకు అన్నదానం చేసే భాగ్యం అల్లాహ్ కల్పించడం తమకు ఎంతో సంతోషంగా ఉందని ముస్లిం సోదరులు రఫీ బ్రదర్స్, బైక్ మెకానిక్‌లు రియాజ్ బాషా, బరందిన్ బాషాలు పేర్కొన్నారు. శుక్రవారం ముందస్తు రంజాన్ శుభాకాంక్షలతో మానవత స్వచ్ఛంద సంస్థ చిట్వేలిశాఖ ఆధ్వర్యంలో స్థానిక ఎంఈఓ కార్యాలయం ఆవరణంలో పేదలకు, పారిశుధ్య కార్మికులకు ఆహార పొట్లాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు కుంభగిరి మునిరావు, ముస్లిం సోదరులు సద్దాం, మస్తాన్, హోటెల్, అబ్దుల్లా, పెంచలయ్య, హాసిం తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికుల కోసం బస్ షెల్టర్ ఏర్పాటు



బస్ షెల్టర్‌ను ప్రారంభిస్తున్న దాతలు, నాయకులు

రాయచోటి టౌన్ : పట్టణంలోని ఎస్ఎన్ కాలనీలో ప్రయాణికుల కోసం బస్ షెల్టర్‌ను ఏర్పాటు చేశారు. శుక్రవారం మాజీ ఎన్‌జీఓ అధ్యక్షుడు ఏపీపీఎస్సీ సభ్యుడు, ప్రేమాలయం వ్యవస్థాపకుడు చింతం వెంకటరెడ్డి జ్ఞాపకార్థం ఈ బస్ షెల్టర్‌ను ఏర్పాట్లు చేసినట్లు ఆయన కుమారుడు మధుసూధన్‌రెడ్డి, కుమార్తె నీరజ, జలజలు తెలిపారు. బస్ షెల్టర్‌ను మాజీ ఎమ్మెల్సీ పోచంరెడ్డి సుబ్బారెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ గంగాప్రసాద్, అర్బన్ సీఐ సుధాకర్ రెడ్డి, ట్రాఫిక్ ఎస్ఐ మహమ్మద్ రఫీ, పొత్తుకూరుపల్లె కృష్ణారెడ్డి, బండపల్లె గంగిరెడ్డి, పోలు సుబ్బారెడ్డి, కౌన్సిలర్ నరసింహారెడ్డి, పల్లపు రమేష్, మహమ్మద్, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉప్పరపల్లెలో ఇఫ్తార్ విందు

సిద్దవటం : మండలంలోని ఉప్పరపల్లి గ్రామంలో మతసామరస్యానికి ప్రతీకగా వైఎస్సార్‌సీపీ నాయకుల ఆధ్వర్యంలో రంజాన్ మాసం చివరి రోజున ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. రంజాన్ చివరి రోజున ఉప్పరపల్లి సర్పంచ్ మేరువ బాలాజీ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. ఈ విందు కార్యక్రమానికి మండల వైఎస్సార్‌సీపీ ఇంచార్జ్ మేడా మధుసూదన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఉప సర్పంచ్ పుత్తా మల్లికార్జున, మాజీ సర్పంచ్ మామిళ్ల పిచ్చయ్య, ఆల్ ఇండియా హ్యాండ్‌లూమ్స్ అసోసియేషన్ మాజీ సభ్యులు ఈశ్వరయ్య, వైఎస్సార్‌సీపీ నాయకుడు కనపర్తి సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

శ్రమదానం

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయం జాతీయ సేవా పథకం యూనిట్-1 వలంటీర్లు ప్రత్యేక శిబిరంలో భాగంగా 5వ రోజు కొప్పర్తి పారిశ్రామికవాడను సందర్శించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డా. పి. సరిత పర్యవేక్షణలో ట్రియోవిజన్ సంస్థ పరిసరాలను శుభ్రం చేసి కంపెనీ సమీపంలోని ప్లాస్టిక్ వ్యర్థాలను ఏరివేశారు.